నంబర్ వన్ మున్సిపాలిటీగా తుర్కయంజాల్

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుల్లో రూ. 8కోట్ల69లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డితో కలిసి ఆయన మున్సిపాలిటీలోని రాగన్నగూడ, తుర్కయంజాల్, కమ్మగూడ, తొర్రూర్ వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీని నంబర్ -1 మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ త్వరలో రూ. 176కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరగబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, మంగమ్మ, కవిత, భాగ్యమ్మ, సునీల్, మాధవి, ఉదయశ్రీ, హరిత, రవీందర్‌రెడ్డి, కీర్తన, అనురాధ, శివలింగం, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, ధర్మన్, ధన్‌రాజ్, సామ భీంరెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ ఇన్‌చార్జి ఈఓగా ప్రేమ్‌కుమార్‌రావు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ ఇన్‌చార్జి ఈఓగా ఎల్బీనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం గ్రేడ్-1 ఈఓ పి.ప్రేమ్‌కుమార్‌రావు గురువారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న గ్రేడ్-1 ఈఓ ఎస్.లావణ్య టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరు కానున్న దృష్ట్యా 53 రోజుల పాటు సెలువుపై వెళ్లారు. ఇన్‌చార్జి ఈఓగా ప్రేమ్‌కుమార్‌రావును నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

కుటుంబ కలహాలకు తల్లీ పిల్లలు బలి

● ఇద్దరు పిల్లలను చెరువులోకి తోసి దూకిన తల్లి
● తల్లి, కుమారుడి మృతదేహాలు లభ్యం
● లభించని కుమార్తె ఆచూకీ


మృతురాలు మంగ


మృతుడు శరత్


ప్రాణాలతో బయటపడిన విఘ్నేష్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): భార్యా భర్తల కలహాలు ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. తల్లీ కుమారుడు మృత్యువు పాలవ్వగా, కుమార్తె జాడ దొరకకుండా పోయింది. భర్తతో కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు కుమారులు, కుమార్తెతో గురువారం రాత్రి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఓ కుమారుడు, కుమార్తెను ఆ చెరువులోకి తోసింది. తర్వాత తానూ దూకింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించాడు. వారి మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. అయితే, కుమార్తె జాడ మాత్రం తెలియకుండా పోయింది. ఆమె కోసం పోలీసులు చెరువులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ముగ్గురు పిల్లలతో చెరువు వద్దకు చేరిన ఆ తల్లి ఇద్దరిని మాత్రమే చెరువులోకి తోసి ఒక కుమారుడిని ఎందుకు వదిలివేసిందో ఎవరికీ అంతుచిక్కడం లేదు. వివరాల్లోకి వెళితే.. వనస్థలిపురం సంపూర్ణ థియేటర్ కూరగాయల మార్కెట్ దగ్గర నివాసముంటున్న ఒరుసు కుమార్‌కు భార్య మంగ (35), కుమార్తె లావణ్య (15), కుమారులు విఘ్నేష్ (5), శరత్ (7) ఉన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మంగ తన పిల్లలను తీసుకొని బస్సులో ఇబ్రహీంపట్నం పెద్దచెరువు వద్దకు చేరుకుంది. పెద్దతూము కింద మెట్ల వెంట కిందికి దిగిన మంగ.. కుమార్తె లావణ్య, కుమారుడు శరత్‌ను నీళ్లలో తోసి తాను కూడా నీళ్లలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మరో కుమారుడు విఘ్నేష్ మాత్రం తప్పించుకొని ఒడ్డునే ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది గాలింపు చేపట్టగా.. మంగ, శరత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. కాగా లావణ్య, శరత్, విఘ్నేష్‌లు వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్ స్కూల్‌లో చదువుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా ఇంట్లో భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. దాంతో పిల్లలను స్కూలు నుంచి తీసుకువస్తానని చెప్పి మంగ.. వారిని తీసుకొని నేరుగా ఇబ్రహీంపట్నం వచ్చినట్లు బంధువులు తెలిపారు. కాగా కుమార్, మంగలది రెండో వివాహమని అప్పటికే ఇద్దరికీ పెళ్లిళ్లు కాగా.. విడాకులు తీసుకుని పెళ్లి చేసుకున్నారు. కుమార్తె లావణ్య మంగ మొదటి భర్త సంతానమని సమాచారం. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో పైలం

● నకిలీ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న సైబర్ కేటుగాళ్లు
● భారీ డిస్కౌంట్ల పేరుతో ఆకర్షిస్తున్న వైనం
● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ సైట్లలో భారీ డిస్కౌంట్‌ల పేరుతో సైబర్ కేటుగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి.. వరుస పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆన్‌లైన్ షాపింగ్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లకు పెరిగిన అధిక గిరాకీని అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు సైబర్ మోసాలకు తెరతీస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారిని టార్గెట్ చేస్తూ నకిలీ వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, శారీస్ తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పించి.. పండుగ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ల పేరిట సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. వెనుకా ముందు చూడకుండా ఆ నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. ఆర్డర్ బుక్‌చేసి, డబ్బులు చెల్లించిన తర్వాత ఎంతకీ పార్శిల్ చేతికి రాక మోసపోతున్నారు. అనుమానం వచ్చిన కస్టమర్లు అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ చేసి ఉంటాయి. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న సైబర్ ముఠాలు కొన్ని అయితే.. మరికొన్ని సైబర్ ముఠాలు మాత్రం తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ క్యూఆర్ కోడ్‌లు పంపి కస్టమర్ల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇలా పండుగ ఆఫర్‌ల పేరుతో నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లు సృష్టిస్తున్న కేటుగాళ్లు అందినంతా దండుకుంటున్నారు.

ప్రతి సైట్‌ను క్లిక్ చేయొద్దు

ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి ఈ కామర్స్ సైట్‌ను ఓపెన్ చేయొద్దు. నమ్మకమైన ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లనే ఎంచుకోవాలి. సాధ్యమైనంత వరకు క్యాష్ ఆన్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో అడగగానే బ్యాంకు ఖాతాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వ్యాలెట్స్ వివరాలు నమోదు చేయొద్దు. ఆ వివరాలన్ని సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్తాయని గుర్తుంచుకోవాలి. ఒక్కసారి డబ్బులు పోగొట్టుకుంటే తర్వాత తిరిగి రావనే విషయాన్ని కస్టమర్లు తెలుసుకోవాలి.

- సైబర్ క్రైమ్ పోలీసులు

నిమజ్జన ఏర్పాట్లను త్వరితగతిన చేపట్టాలి

● గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనానికి చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులకు సూచించారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లను కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, భాగ్యలక్ష్మి, సుజాతానాయక్, అరుణారవీందర్, జడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా స్నేహపూర్వక వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రేటర్ పరిధిలో ఉన్న మేజర్ చెరువు లు, బేబీ పాండ్స్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు. నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ శాఖలకు ఉత్సవ సమితి నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. మండపంలో గణేషున్ని ప్రతిష్ఠించిన రోజు నుంచి నిమజ్జనం వరకు మండపాల వద్ద ఎ లాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువులో వీలైనంత వరకు పూడికతీత చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి మేయర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు రాములుగౌడ్, ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.


సరూర్‌నగర్ చెరువు కట్టపై మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, అరుణా రవీందర్‌రెడ్డి, సుజాతానాయక్, భాగ్యలక్ష్మి, జడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి


సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికారులు త్వరితగతిన చేపట్టాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. గురువారం మన్సూరాబాద్ పెద్దచెరువు, నాగోల్ చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, డీసీలు తిప్పర్తి యాదయ్య, సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి తరలివచ్చే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లపై ఉన్న ర్యాంప్‌లు, చెట్ల కొమ్మలను తొలగించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీలు కృష్ణయ్య, కాశీరెడ్డి, సీఐలు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.


కందికట్ట తేజ(ఫైల్)

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవాల సేకరణ

సనత్‌నగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌కు గురైన యువకుడి నుం చి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. సరూర్‌నగర్‌కు చెందిన కందికట్ట తేజ(20) ఆగస్టు 17న బైక్‌పై వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ముందుగా ఉస్మానియా ఆస్పత్రికి, తర్వాత ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. 6 రోజుల పాటు చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. తేజ కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించిన జీవన్‌దాన్ సభ్యులు అతడి నుంచి లివర్, 2 కిడ్నీలు, గుండె సేకరించారు.

మదర్ డెయిరీ ఆరు డైరెక్టర్ పదవులకు 21 నామినేషన్‌లు దాఖలు

● గురువారం ముగిసిన నామినేషన్ల పరిశీలన

హయత్‌నగర్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలోని ఆరు డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఎన్నికలకు బుధవారం 21 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 15 మంది నామినేషన్లు వేయగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరు మంది నామినేషన్లు వేశారు. గురువారం మదర్ డెయిరీ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా 21 నామినేషన్లు సవ్యంగాను ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి.

మాజీ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి బెయిల్‌పై విడుదల

సైదాబాద్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా మాజీ అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆగస్టు 12న రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌తో పాటు ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. అనంతరం జడ్జి రిమాండ్ విధించడంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, గురువారం ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కొత్తపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో..

కొత్తపేట: కొత్తపేటలో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌బీఐ అల్కాపురిశాఖ చీఫ్ మేనేజర్ ఓంకారేశ్వర్ స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులనూ సత్కరించారు. మోహన్‌నగర్ మండల ప్రాథమిక పాఠశాలలో బీజేపీ నాయకులు బోల్లం యశ్పాల్‌గౌడ్ హెచ్‌ఎం ఆంజనేయులు, టీచర్లు సునీత, సంధ్య, అరుణజ్యోతిలను సన్మానించి, ఉత్తమ ఉపాధ్యాయ జ్ఞాపికలను అందజేశారు. అమ్మఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ హెచ్‌ఎం, టీచర్లను సన్మానించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డితో కలిసి సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉంటుందన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని అమలు చేశారన్నారు. అందులో భాగంగా లబ్ధిదారులకు రూ. లక్ష చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ ఆదిత్య, బీఆర్‌ఎస్ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఉద్యమకారుల కమిటీ కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, సాజిద్, ఆకుల అరవింద్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, సుశీలారెడ్డి పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అందిస్తాం

●ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : అర్హులైన లబ్ధిదారులందరికీ ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని శివ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 104 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో సుమారు రూ. 5కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్‌ఐ నిజాముద్దీన్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆజంపురలో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం

రూ.8కోట్లతో రెండేళ్లలో నిర్మించేందుకు ప్రణాళిక

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని ఆజంపుర వార్డు కార్యాలయం వద్ద నున్న ఖాళీ స్థలంలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్, డీపీవో యుగెంధర్‌రెడ్డి, కార్పొరేటర్ ఆయేషా రుబినా, వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపాల్, ఫెడ్ సెక్రెటరీ జనరల్ చెరుకు నాగభూషణం, గజం నర్సింగ్‌రావులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆజంపురలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం సమీపంలో ఉన్న 980 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కా ర్యాలయం భవనం నిర్మాణానికి రెండేళ్ల క్రిత మే ప్రతిపాదించామన్నారు. ఐదంతస్తులతో సుమారు రూ.8కోట్లతో మలక్‌పేట సర్కిల్- 6 కార్యాలయ భవనం నిర్మాణానికి అంచనాలను రూపొందించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్ లేని కారణంగా పనులు పెండింగ్‌లో పడ్డాయని, తాత్కాలికంగా జాతీయ దివ్యాంగుల పార్క్‌లో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం ఏర్పాటు చేయించామన్నారు. మరో రెండేళ్లలో మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం పూర్తి చేయించి పూర్తిస్థాయిలో కార్యాలయాలన్ని ఒకే చోట ఉండేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. అందుకు తన ఎమ్మెల్యే బడ్జెట్ నుంచి రూ.5కోట్ల నిధులను కేటాయిస్తానని తెలిపారు. మిగతా రూ.3 కోట్ల నిధులను జీహెచ్‌ఎంసీ నుంచి మంజూరు చేయించేలా ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు.


జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జెడ్సీ వెంకన్నతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

కొత్తపేటలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలకు రీ సర్వే చేయిస్తాం

● తహసీల్దార్ హేమామాలిని

కొత్తపేట, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): ఉప్పల్ మండల పరిధిలోని కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ వద్ద అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలకు రీ సర్వే చేయిస్తామని తహసీల్దార్ హేమామాలిని వెల్లడించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని విన్నవించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ స్థలాల సంరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కూడా హైడ్రా కార్యాలయంలో కొత్తపేట ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ వద్ద అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాల వివరాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో గురువారం తహసీల్దార్ హేమామాలిని, ఏఈ సతీష్, ఉప్పల్ ఆర్‌ఐ అశ్విని తదితరులు కొత్తపేట సర్వే నెం. 142, 143, 146, 159, 160 లలో గల ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ప్రస్తుత తెలంగాణ పార్కు స్థలం సహా పరిసర ప్రభుత్వ స్థలాలు మొత్తం 3 ఎకరాల 12గుంటలు ఉండాలని, సదరు స్థలం అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం 19గుంటలు మాత్రమే ఉందని కార్పొరేటర్ పరిసర కాలనీల ప్రతినిధులు అధికారులకు విన్నవించారు. ఇక్కడి సర్వే నెం.143, 142, 159లలో మళ్లీ సర్వే చేపట్టాలని ఇటీవల మేడ్చల్, మల్కాజిగిరి కలెక్టర్ సైతం ల్యాండ్ సర్వే కమిషనర్‌కు లేఖ రాసినట్లు కాలనీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు.

గతంలో ల్యాండ్ సర్వే డీడీ అధికారులు ఇక్కడి సర్వే నెం.లలో గల ప్రభుత్వ స్థలాల విస్తీర్ణాన్ని మార్చేశారని కాలనీ వారు ఆరోపించారు. 1975-76 రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెం.143లో పిట్లలోనికుంట ఉండిందని, ప్రస్తుతం అక్కడ నివాసాలు వెలిశాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు లక్ష్మీరాజ్యం, రాంనాథ్‌రెడ్డి, విజయకుమార్, శ్రీనివాస్‌రావు, సుధాకర్, విజయభాస్కర్, డీ. సంగ్రామ్ పాల్గొన్నారు.

అవినీతి, నిర్లక్ష్యంపై డిస్కం వేటు

● 7 నెలల్లో 19 మంది సిబ్బందిపై చర్యలు
● ఆరుగురి సస్పెన్షన్
నలుగురు కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ
● 9 మందికి షోకాజ్ నోటీసులు
● జాబితాలో మరికొంతమంది అవినీతి అధికారులు
● త్వరలో వారిపై చర్యలు తీసుకునే అవకాశం..?

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో అవినీతికి పాల్పడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో గడిచిన 7 నెలల్లో 19 మంది ఇంజనీర్లు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆరుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేయగా, నలుగురిని కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేయగా మరో 9 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అవినీతి ఆరోపణల జాబితాలో మరికొంతమంది అధికారుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో అంతర్గత విచారణ చేసి వారిపై కూడా త్వరలో చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అక్రమార్కుల జాబితాలో కొందరు ఉన్నతాధికారులున్నారని వారిపై లోతుగా విచారణ జరిపి ఆ తర్వాతే చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏ శాఖలో లేని విధంగా ఆదాయం ఎక్కువ తెచ్చిపెట్టే ప్రాంతాలు ఫోకల్, ఆదాయం తక్కువ వచ్చేప్రాంతాలు నాన్‌ఫోకల్‌గా విభజించారు. ఫోకల్‌ప్రాంతాల్లో పోస్టింగుల కోసం కొందరు అధికారులు ఇప్పటికే రాజకీయనేతలతో పైరవీలు చేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. 15 రోజుల క్రితం సరూర్‌నగర్ సర్కిల్‌లో డీఈటీ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏడాది క్రితం గచ్చిబౌలిలో ఏడీఈ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

అవినీతి ఆరోపణలపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌జోన్ పరిధి శివారు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులపై ఎక్కువ అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లో గతంలో ఓ సబ్‌డివిజన్‌ను రెండు సబ్‌డివిజన్లుగా విభజించి మరో ఇద్దరు ఏడీఈలకు పోస్టింగులిచ్చారు. సైబర్‌సిటీ సర్కిల్ కొండాపూర్ డివిజన్‌లోని అల్లాపూర్ సెక్షన్‌లో ఓ లైన్‌మన్‌తో పాటు ఇద్దరు ఆర్టిజన్లను సస్పెండ్ చేశారు. అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మంగళవారం ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేడ్కర్‌ను కార్పొరేట్ ఆఫీస్‌కు అటాచ్‌చేయగా, నార్సింగ్ ఏఈ సందీప్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. మేడ్చల్, హబ్సిగూడ, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోని పలు సబ్‌డివిజన్లలో కొంతమంది ఏడీఈలతో పాటు ఏఈలపై పెద్దసంఖ్యలో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలు వచ్చే అధికారులను త్వరలో జరిగే బదిలీల్లో కార్పొరేట్ ఆఫీస్‌తో పాటు ఆఫీస్ పోస్టులకే పరిమితం చేయనున్నారు.



కీలకమైన మెట్రోజోన్ సీఈ పోస్టు ఖాళీ

గ్రేటర్ విద్యుత్ సరఫరాలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా బాధ్యతలు నిర్వహించిన మోహన్‌రెడ్డి ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆపరేషన్ విభాగంలో కీలకమైన మెట్రోజోన్ సీఈగా ఇప్పటి వరకు ఎవ్వరిని నియమించకపోవడంతో పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. సీనియర్ స్థాయి ఎస్‌ఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు భారీవర్షాలు, మెట్రోజోన్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సమస్యలు పరిష్కరించాలంటే గ్రేటర్ జోన్‌పై పూర్తిగా అవగాహన కలిగిన సీనియర్ సీఈకి మెట్రోజోన్ సీఈ బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.